క్లుప్తంగా

పేదలకు టార్పాలిన్ పట్టలు పంపిణీ



టార్పాలిన్ పట్టలు అందజేస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని వెంగముక్కల పాలెంలోని నిరుపేదలకు ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత శుక్రవారం టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు. క్విస్ కాలేజీకి చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా పేదలకు ఇళ్ల మీద కప్పుకునే టార్పాలిన్ పట్టలతో పాటు పౌడర్లు, టూత్ పేస్టులు, సబ్బులతో పాటు ఇతర వస్తువులు అందజేశారు. ఇళ్ల స్థలాలు మంజూరైన వారి ఇళ్లకు వర్షం వచ్చినప్పుడు వర్షం నీరు ఇళ్లలోపల పడకుండా ఉండేందుకు టార్పాలిన్ పట్టలు ఇస్తున్నట్లు మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, అంజిరెడ్డి, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థికసాయం

ఒంగోలు అర్బన్: తల్లిదండ్రులు లేని చిన్నారులకు ఇల్లు నిర్మించుకునేందుకు సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ట్రస్టు కార్యాలయం వద్ద ఆర్థికసాయం అందజేశారు. బేస్తవారిపేట మండలం జగ్గంభట్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన ముగ్గురు చిన్నారులు భావన, యశ్వంత్, కీర్తనలకు పసితనంలోనే తల్లిదండ్రులు దూరమై ఒంటరిగా మిగిలారని ట్రస్ట్ సెక్రటరీ సర్దార్‌బాష తెలిపారు. చిన్నతనంలోనే పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిన్నారులు తమకు చిన్న గూడు కట్టుకునేందుకు సహాయం చేయాలని కోరడంతో ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహాయంతో వారికి రూ.37,500 అందజేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీమ్ విజేతలు వీరే

ఒంగోలు: ఆర్టీసీ ఒంగోలు డిపో పరిధిలో గిఫ్ట్ స్కీమ్ విజేతల ఎంపికను శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో నిర్వహించారు. డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు, సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సయానాబేగం ఆధ్వర్యంలో డ్రా తీశారు. పొందూరు, తాళ్లూరు, గుండాయపాలెం, కొణిజేడు రూట్లలో గిఫ్ట్ స్కీమ్ డ్రా ప్రతి 15 రోజులకు ఒకమారు తీసి విజేతలకు బహుమతులు అందిస్తున్నారు. తాళ్లూరుకు చెందిన సుబ్బారావు, కొణిజేడుకు చెందిన ప్రభుదాస్, పొందూరుకు చెరందిన ఈశ్వరమ్మ, గుండాయపాలెంకు చెందిన పి.శేషమ్మ లక్కీ డ్రా విజేతలుగా నిలిచారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన పీడీ



ఆకుకూరలు, కూరగాయల పంటను పరిశీలిస్తున్న వసుంధర

కొత్తపట్నం: రైతు సాధికార సంస్థ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు, ఆకుతోటలు సాగుచేస్తున్న మోపిదేవి వెంకటేశ్వర్లు పొలాలను శుక్రవారం డీఆర్‌డీఏ పీడీ వసుందర పరిశీలించారు. ప్రధానంగా పండిస్తున్న బీర, వంగ, ఆకుకూరలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో వారు అవలంబిస్తున్న పద్ధతుల గురించి, కషాయాలు, ద్రావణాల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కొత్తపట్నంలో పురిణి మల్లేశ్వరి ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి ప్రకృతి వ్యవసాయం ఏ విధంగా చేస్తారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరా పండుగ...



వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి భారీగా హాజరైన డ్వాక్రా గ్రూపు సభ్యులు



డ్వాక్రా గ్రూపు సభ్యులకు నమస్కరిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలినేని దంపతులు



13,500 మంది మహిళలకు చీరల పంపిణీని ప్రారంభిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు

డ్వాక్రా మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కొత్తపట్నంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని చెక్కులు పంపిణీతో పాటు మహిళలకు చీరలు అందజేశారు. ఏ కష్టం వచ్చినా తామున్నామంటూ భరోసా ఇచ్చారు.

– కొత్తపట్నం

అడుగడుగునా అభిమానం

- బాలినేని శచీదేవి, శ్రీకావ్య ప్రచారానికి పోటెత్తిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు
- ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని విజ్ఞప్తి



బాలినేని శచీదేవి, శ్రీకావ్య పర్యటనలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఒంగోలు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, కోడలు శ్రీకావ్య, శ్రీకావ్య వదిన కుండా లిఖిత కలిసి శుక్రవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి ప్రజానీకం పోటెత్తారు. స్థానిక మారుతీనగర్ మొదటిలైను నుంచి ప్రచారం ప్రారంభించారు. రోడ్డుకు తూర్పు వైపున 45వ డివిజన్, పశ్చిమాన 44వ డివిజన్ ఉండడంతో 44వ డివిజన్‌లో శ్రీకావ్య, నిఖితలు ప్రచారం ప్రారంభించగా, 45వ డివిజన్‌లో శచీదేవి ప్రచారం ప్రారంభించారు. 44వ డివిజన్ కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డితో పాటు డివిజన్ నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారుతీనగర్ మొదటిలైను, కర్నూల్ రోడ్డు జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున ప్రజానీకం హాజరై వారిని సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా పలువురితో డివిజన్‌లో సమస్యల గురించి శచీదేవి ప్రస్తావించారు. ఇద్దరు కార్పొరేటర్లపై స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఇద్దరూ పోటీపడి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అందుకు ఎమ్మెల్యే బాలినేని సహకారం మరవలేమన్నారు. దశాబ్దాలుగా ఉన్న సమస్యలను సైతం పరిష్కరించారని, నేడు తాము ఆనందంగా ఉన్నామని చెప్పుకొచ్చారు. తమ సమస్య ఏదైనా చెప్పుకునేందుకు మంచి కార్పొరేటర్లు ఉండటం అదృష్టమని అన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే బలపరుస్తామన్నారు. వాసన్నను గెలిపించుకుంటామని, ఆయన మళ్లీ మంత్రి అయితే ఇంకా శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని భావిస్తున్నామని అన్నారు. టీడీపీ చెప్పే అబద్ధాలను నమ్మే పరిస్థితి లేదని, తమ ప్రాంతం వైఎస్సార్ సీపీకి కంచుకోట అని పేర్కొన్నారు. మరో వైపు శ్రీకావ్య, లిఖితలు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రతి గడపలో విశ్వాసం తొణికిసలాడుతోందని వారు పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితే ప్రజలు–నాయకుల మధ్య ఉండాలనే ఆకాంక్షతోనే మహిళలతో



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న బాలినేని శచీదేవి, శ్రీకావ్య

మమేకం–స్త్రీశక్తితో శచీదేవి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు వాస్తవాలను బేరీజు వేసుకుని ముందుకు సాగుతారని, అయితే వారికి వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని, అందుకే తాము ఇంటింటికి వెళ్లి మహిళలతో మమేకం అవుతున్నామని తెలిపారు. బాలినేని శచీదేవి మాట్లాడుతూ ఐదుసార్లు ఒంగోలు ఎమ్మెల్యేగా వాసన్నను గెలిపించిన ప్రతిఒక్కరూ ఈ దఫా కూడా గెలిపించేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్రంలో జగనన్న, ఒంగోలులో వాసన్న అందించే సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధికి వ్యతిరేకంగా టీడీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలన్నారు. పథకాల లబ్ధిదారులంతా ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకట్రావు, ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ కోసూరి రాధ, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్, జిల్లా, నగర అధ్యక్షురాలు బడుగు ఇందిర, తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, కార్పొరేటర్లు కండే స్వాతి రమణయ్య యాదవ్, తాడి కృష్ణలత, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి లీలాకుమారి, తూము పద్మ, ఒంగోలు నగర పాలక సంస్థ కో ఆప్షన్ మెంబర్ వర్దు శేషయ్య, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి బెల్లంకొండ అశోక్, మోతడిక అంకయ్య, హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రిటైర్డ్ నాయకులు పల్లెర్ల నరసింహారెడ్డి, పాతకొట్టు వెంకటేశ్వరరెడ్డి, తూము పద్మ, 45వ డివిజన్ అధ్యక్షుడు పి.రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు పాలడుగు శ్రీనివాసరెడ్డి, వెలిగొండారెడ్డి, రావి రమణమ్మ, గుండపు ఉమ, బాణావత్ మంజుల, ఉండేల శ్రీనివాసరెడ్డి, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, గంగిరెడ్డి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపలి వెంకాయమ్మ

చీమకుర్తి: మేదరమెట్ల వద్ద ఈ నెల 10న జరగనున్న సిద్ధం మహాసభను జయప్రదం చేయాలని మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. చీమకుర్తి అర్బన్, రూరల్ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సాయంత్రం చీమకుర్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి సిద్ధం సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, పలు గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి పీఎంఈజీపీ ఆర్థికసాయం



పీఎంఈజీపీ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, సురేష్

కొత్తపట్నం: భర్త అకాల మరణంతో పేదరికంతో బాధపడుతున్న కుటుంబానికి కెనరా బ్యాంక్ మేనేజర్ సురేష్ పీఎంఈజీపీ పథకం ద్వారా రూ.2 లక్షలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి శుక్రవారం కొత్తపట్నం వచ్చిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ సురేష్ చేతుల మీదుగా మంజూరు పత్రాన్ని బాధిత మహిళ మాధవికి అందజేశారు. లక్షకు 35 శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. నగదును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగి పిల్లలను బాగా చదివించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన రూరల్ సీఐ

మద్దిపాడు: మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరవగా, రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ పరిశీలించారు. కళాశాల చుట్టూ వంద మీటర్ల పరిధిలో ఎక్కడా జెరాక్స్ షాపులు లేకుండా చూసుకోవాలని, 144 సెక్షన్ అమలు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో రెగ్యులర్ విద్యార్థులు 35 మంది, 105 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 19 మంది గైర్హాజరు అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సీసీ కెమేరాల పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నట్లు చెప్పారు.

కుటుంబ సంబంధాలకు దర్పణం..

కలిసి ఉంటే కలదు సుఖం



పక్కింటి మొగుడు నాటకంలోని ఓ సన్నివేశం

ఒంగోలు మెట్రో: స్థానిక హైదరీ క్లబ్లో మూడు రోజులుగా జరుగుతున్న నాటకోత్సవాలు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. శుక్రవారం రాత్రి ఏడు గంటలకు ప్రముఖ నాటక రచయిత గోవిందరాజుల నాగేశ్వరరావు రచించిన పక్కింటి మొగుడు నాటిక హాస్య భరితంగా సాగింది. 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పడమటి గాలి నాటకంపై రూపొందించిన ది సెన్సేషన్ ఆఫ్ పడమటి గాలి డాక్యుమెంటరీని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆవిష్కరించారు. కుటుంబ సంబంధాలకు దర్పణంగా కలిసి ఉంటే కలదు సుఖం నాటకం నిలిచింది. క్లబ్ ప్రాంగణంలో ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక కుటుంబ సంబంధాలకు దర్పణం పట్టింది. ధనం కన్నా మానవత్వ విలువలు ముఖ్యమని చాటి చెప్పింది. గోవిందరాజుల నాగేశ్వరరావు రచనకి బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం ప్రాణం పోసింది.

వీఆర్‌వో శ్రీనివాసమూర్తికి వీడ్కోలు



శ్రీనివాసమూర్తి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంగోలు రూరల్: సుదీర్ఘకాలం రెవెన్యూశాఖలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తించిన వీఆర్‌వో శ్రీనివాసమూర్తికి శుక్రవారం ఘనంగా వీడ్కోలు తెలిపారు. పదవీ విరమణ చేసిన శ్రీనివాసమూర్తి ఒంగోలు నగరంలో కరణంగా, వీఆర్ఏగా పనిచేశారు. ప్రస్తుతం కరవది–1 వీఆర్‌వోగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్ కుమార్ మాట్లాడుతూ 30 సంవత్సరాలకుపైగా రెవెన్యూ శాఖలో పలు బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు. డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ సమర్థవంతుడైన వీఆర్‌వో పదవీ విరమణ పొందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ, ఎలక్షన్ డీటీ, అన్ని గ్రామాల వీఆర్‌వోలు పాల్గొని శ్రీనివాసమూర్తిని ఘనంగా సన్మానించారు. అనంతరం కరవదిలో సర్పంచ్ అధ్యక్షతన కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఘనంగా సన్మానించారు.

హింస లేని సమాజం కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

ఒంగోలు టౌన్: హింస లేని సమాజం కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం ఐద్వా జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమాన హక్కులను కోరుతూ విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రపంచీకరణ విధానాల వలన మహిళల జీవితాలు దుర్భరం అవుతున్నాయన్నారు. ఉపాధి రహిత అభివృద్ధి, మితిమీరిన హింస, అధిక ధరలు తీవ్ర రూపం దాల్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాలతో సాధించుకున్న చట్టాల పరిరక్షణ, అమలు కోసం మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. మార్చి 1 నుంచి 15వ తేదీ వరకు మహిళలను సమీకరించి సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 12న ఐద్వా వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కమిటీలు ఉన్న గ్రామాల్లో పతాకాన్ని ఆవిష్కరణ చేయనున్నట్లు చెప్పారు. మార్చి 19న మహిళా ఉద్యమ నేత మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా మహిళా మ్యానిఫెస్టో ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఐద్వా నాయకులు షేక్ నాగూర్‌బీ, జి.ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, ఎస్‌కే బషీర, బి.గోవిందమ్మ పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై దాడులు ఆపాలని ధర్నా



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను నిరసిస్తూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి మాట్లాడుతూ బెంగాల్‌లో మాఫియా డాన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లా అండ్ ఆర్డర్‌ను కంట్రోల్ చెయ్యాలని కోరారు. ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్, పార్లమెంట్ కన్వీనర్ సెగ్గం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులు శివాజీ యాదవ్, నాగేశ్వరరావు, తోగాటి శ్రీనివాసరావు, తిండి నారాయణరెడ్డి, క్రిష్ణవేణి, బొద్దులూరి ఆంజనేయులు, ధనిశెట్టి రాము తదితరులు పాల్గొని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పశ్చిమ బెంగాల్‌లో 356 ఆర్టికల్ ప్రయోగించి లా అండ్ ఆర్డర్‌ను అదుపులోకి తీసుకురావాలని కోరారు.

నెమ్మానికి సత్కారం



నెమ్మానిని సన్మానిస్తున్న సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ

ఒంగోలు మెట్రో: దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో జరుగుతున్న డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ, దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసింది. ఇందులో సమస్య పూరణంలో పాల్గొన్న ఒంగోలుకు చెందిన కవి, రచయిత, ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు నెమ్మాని సీతారామమూర్తిని ఘనంగా సత్కరించారు. సహస్రావధాని మాడుగుల నాగఫణిశర్మ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి దుర్గాప్రసాద్, దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు, సంస్కృత ఆంధ్ర మహా పండితులు డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, పీఏటీకే రంగాచార్యులు, ముఖ్య అతిథులు నెమ్మాని తెలుగు భాషకు చేస్తున్న సేవలను ప్రశంసించారు. జ్ఞాపిక, నగదు బహుమతితో ఆయనను సత్కరించారు.

అంబేడ్కర్ వాదుల మహాసభకు తరలిరావాలి

ఒంగోలు: అంబేడ్కర్ వాదుల మహాసభకు తరలిరావాలని దళిత బహుజన సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించే సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ హాజరవుతారన్నారు. ముందుగా స్థానిక కబాడీపాలెంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద నుంచి సాయంత్రం 4 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ చేరుకున్న అనంతరం సభ ఉంటుందన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ వాదంతో పనిచేస్తున్న నాయకులు, మేధావులు పాల్గొని దళిత బహుజనులకు దిశానిర్దేశం చేస్తూ ఉపన్యసిస్తారన్నారు. స్త్రీలు–అంబేడ్కర్ గురించి కమిషన్ చైర్మన్ విశ్లేషణాత్మక ఉపన్యాసం ఉంటుందన్నారు. సభ అనంతరం దళిత బహుజన సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి సమీక్షిస్తారని తెలిపారు.